# విన్నపం

ఈ 'అగ్ని' విషయం నేను ప్రస్తావించేందుకు ప్రేరకులు శ్రీ బెజవాడ రామశేషయ్యగారు.

విజయవాడ రామానగర్‌లోని 'శ్రీ శివరామకృష్ణ క్షేత్రం'లో ఇరవై ఆరేళ్ళుగా పెద్దలచేత, పండితులచేత ఉభయ సంధ్యలలో నిరాటంకంగా ఆధ్యాత్మిక ప్రవచనాలను ఏర్పాటు చేస్తున్న భగవత్కథా శ్రవణపరులు. భాగవతపరాయణులు. ఈశ్వరభక్తితో, వినయంగా అనేకమంది పెద్దల ఉపన్యాసాలను వింటూ, వాటిని హృదయగతం చేసుకున్న ధన్యజీవి. బ్రహ్మశ్రీ ముదిగొండ పిచ్చయ్య శాస్త్రిగారిని గురువుగా ఆరాధించి, తన బుద్ధిని చైతన్యవంతం చేసుకున్న గురుభక్తిపరులు. అరవై తొమ్మిదేళ్ళ వృద్ధాప్యంలో సైతం అవిశ్రాంతంగా భాగవత కథా యజ్ఞాన్ని కొనసాగిస్తున్న సార్థకజీవనులు. అనేకమంది పెద్దలు ఉపన్యసిస్తుండగా, ప్రసంగ సందర్భంగా వివిధ విషయాలలో వారు చెప్పిన అగ్నుల పేర్లు ఒక జాబితాగా వ్రాసుకున్నారు రామశేషయ్యగారు. కాలాగ్ని, క్రోధాగ్ని, జఠరాగ్ని, దావాగ్ని, బడబాగ్ని, తపోగ్ని, జ్ఞానాగ్ని, యోగాగ్ని, జ్వరాగ్ని .... ఇలా అనేకాగ్నుల పేర్లు ఎంతో భక్తి శ్రద్ధలతో రాసుకున్నారు.

శివరామకృష్ణ క్షేత్రంలో నేను చాలామార్లు వివిధ విషయాలపై ప్రసంగాలు చేయడం తటస్థించింది. ఓ సారి రామశేషయ్యగారు తాను అగ్నిపేర్లను వ్రాసుకున్న కాగితాన్నిచ్చి, అగ్ని విషయంగా ఉపన్యసించమని కోరారు. వారి ఆ ప్రయత్నం, ఆసక్తి నన్ను ఆనంద పరవశుడ్ని

చేశాయి. వారి జిజ్ఞాస ప్రశంసార్హం. ఆయన కోరిన కోరికే నాకు ప్రేరణ అయింది. అప్పటినుండి 'అగ్ని' విషయమై భావన చేయసాగాను.

ఉమామహేశ్వరుల కృపతో కొన్ని విషయాలు శోధించగలిగే అవకాశం, అదృష్టం లభించాయి. వేదమంత్రాలు, పురాణేతిహాసాలు, వివిధశాస్త్ర విషయాలు పరిశీలిస్తూ, నా బుద్ధిశక్తి ననుసరించి అగ్ని విషయ భావనతో - 'అగ్ని' అనే అంశంపై నాలుగు రోజులు ఉపన్యసించాను.

దానిని విన్న పెద్దలు ఆనందించి, "నా ఉపన్యాసాన్ని పుస్తకంగా తీసుకురావాల"ని కోరారు. అప్పుడు రామశేషయ్యగారు, ఆ ఉపన్యాసాన్ని పుస్తకంగా వ్రాయమని, తానే పూర్తిగా ముద్రణా వ్యయాన్ని భరిస్తానని చెప్పారు. కృతిని వెలుగులోకి తీసుకురావడం ఒక యజ్ఞమే.

ఆ తరువాత - నేను ఉపన్యసించిన విషయాలనే కాక, ఉపన్యాసానంతరం సాగించిన సాధన, భావనలతో — అగ్నిమూర్తి కృపచేత మరికొన్ని అంశాలను కూడా చేర్చి ఈ "అగ్ని" గ్రంథాన్ని రచించాను.

'అగ్ని'పై ఇది సమగ్ర గ్రంథం అని నేను చెప్పడంలేదు. ఇంకా రాయాల్సింది ఎంతో వుందనే అనిపిస్తోంది. అసలు వాఙ్మయమంతా అగ్నిమయమే. విశ్వమంతా అగ్నిమయమే. కనుక చూసేకంటికి అగ్ని అనంతంగానే కనబడతాడు. ఎంత రాసినా ఇంకా మిగిలే వుందనిపించడమే అగ్ని మహత్తు. అపార సముద్రజలం నుండి ఒక ఉద్ధరిణతో జలం తీసినట్టుగా, నా బుద్ధికి అందినంత మాత్రమే అందించాను.

నా బుద్ధినీ, వాక్కునూ సార్థకం చేసుకునేందుకే ఈ కృతి రచన.

నా ఆరాధ్య దైవాలైన ఉమామహేశ్వరులకు దీనిని అంకితంగా సమర్పించుకుంటూ, దీనికి ఫలంగా వారి ఎడల అచంచలభక్తి లభించాలని ప్రార్థిస్తున్నాను. ఇవి ఆ వాగర్థరూపులు పలికించిన పలుకులే.

ఈ గ్రంథానికి ప్రేరకులు మాత్రమే కాకుండా, దీని ముద్రణా వ్యయం భరించి, వెలుగులోకి తెచ్చిన శ్రీ బెజవాడ రామశేషయ్యగారికి

కృతిపోషణ పుణ్యకార్య ఫలంగా అగ్నిభగవానుని దివ్యానుగ్రహం లభించాలని కోరుకుంటున్నాను. ఆయనకు పరిపూర్ణ ఆయురారోగ్యాలు లభించాలని అగ్నిభట్టారకుని ప్రార్థిస్తున్నాను.

నాకు అక్షర సంస్కారాన్నీ, ఆధ్యాత్మిక జిజ్ఞాసనీ కలిగించి, తన దీవెనల బలంతో నన్ను జీవింపజేస్తూన్న నా గురుదేవులు, నా తండ్రిగారు బ్రహ్మశ్రీ సామవేదం రామమూర్తి శర్మగారికి వినయ వినమిత ప్రణామ సహస్రాలు. నా మాతృమూర్తికి నా కై మోడ్పులు.

నా ఆరాధ్య సాహితీవిరాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి పుత్రులైన శ్రీ పావని శాస్త్రిగారు నా యందు వాత్సల్యంతో తమ 'ఆశీరాశీస్సు'ను ప్రసాదించినందుకు ధన్యుడ్ని.

నా ఆధ్యాత్మిక జీవితాన ఉత్సాహాన్ని ఉద్దీపింపజేసే నా ధర్మపత్ని పుష్పలత, ఈ గ్రంథం పూర్తి కావడంలో తగిన ప్రోత్సాహాన్నిచ్చినందుకు కృతజ్ఞతా పాత్రురాలు.

ముఖచిత్రం అందంగా రూపొందించి, ముద్రించిన సహృదయ మిత్రులు శ్రీ 'రామ'గారి స్నేహానికి అభివందనాలు.

ఈ గ్రంథం వెయ్యి ప్రతులుగా కాక, పదిహేను వందల ప్రతులుగా వెలువడేందుకు కారకులు సుహృన్మణి శ్రీ అన్నాజీప్రసాద్ (అన్నాజీ ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ) గారికి, సదా స్నేహపూర్వక కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని సకాలములో చక్కగా ముద్రించి ఇచ్చిన శ్రీ అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్ వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఈ కృతి సాంబశివుని కృప. ఆ స్వామి ప్రసాదించిన అక్షరశక్తి ఆ స్వామికే నైవేద్యం.

—సామవేదం షణ్ముఖశర్మ

# అగ్ని

అగ్నివర్ణాం అగ్నిరూపాం అగ్నినేత్రాం సరస్వతీమ్।
వాఙ్మయీం వాక్ప్రదాం వందే వాణీం వాగీశ్వరీం సదా॥

పాపదాహకరూపం త్వాం చిత్తపావనకారకం।
జ్ఞానప్రకాశకం వందే అగ్నిరూపం మహేశ్వరమ్॥

* * *

'సర్వం బ్రహ్మమయం జగత్'—

అన్ని వేదాలకీ, పురాణాలకీ, ఉపనిషత్తులకీ పరమ లక్ష్యమిదే.

బ్రహ్మమే లక్ష్యం. బ్రహ్మమే ఉపాస్యం. బ్రహ్మమే ఇష్టం. బ్రహ్మమే శరణ్యం.

బ్రహ్మం — అంటే :

బృహత్వాత్ బృంహణత్వాత్ —బ్రహ్మ. 'మహోన్నతమై', 'సర్వవ్యాపకమై', సత్యమై, చిన్మయమై, ఆనం